సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం। 5। జనవరి। 2025



సోమశిలలో 71.754 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శనివారానికి 71.754 టీఎంసీలు ఉన్నాయి. 2500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, డెల్టాకు 2050, ఉత్తర కాలువకు 600, కండలేరుకు 200, దక్షిణకాలువకు 350 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రా)	రూ.79,480
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.7,215
3శాతం జీఎస్టీతో	రూ.7,431
నవర (8 గ్రా)	రూ.59,448

గరిష్టం/కనిష్టం
28.6 /21.9

వాతావరణం

జిల్లాలో ఆదివారం వాతావరణం సాధారణంగా ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ శనివారం 71 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

దేహదారుఢ్య పరీక్షలకు 205 మంది హాజరు



లక్ష్యసాధనకు పరుగులు తీస్తున్న మహిళా అభ్యర్థులు

నెల్లూరు(క్రైమ్): పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా పోలీసు కవాతు మైదానంలో జరుగుతున్న దేహదారుఢ్య పరీక్షలు శనివారం ఐదో రోజుకు చేరుకున్నాయి. ఉదయం 5 గంటల నుంచే మహిళా అభ్యర్థులు 205 మంది కవాతు మైదానానికి చేరుకున్నారు. ఎస్పీ జి.కృష్ణకాంత్ పర్యవేక్షణలో పోలీసు అధికారులు తొలుత అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి, ఎత్తు, ఛాతి కొలతల పరీక్షలు నిర్వహించారు. వాటిలో అర్హత సాధించిన అభ్యర్థులకు పరుగుపందెం, లాంగ్‌జంప్ విభాగాల్లో పరీక్షలు నిర్వహించారు.

వన్‌మ్యాన్ కమిషన్‌కు వినతులు వెల్లువ

- ఎస్సీ కులాల ఉపవర్గీకరణపై 363 వినతులు




అర్జీలు స్వీకరిస్తున్న వన్‌మ్యాన్ కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా

నెల్లూరురూరల్: ఎస్సీ కులాల ఉపవర్గీకరణకు సంబంధించి విజ్ఞప్తులు స్వీకరించేందుకు నెల్లూరుకు వచ్చిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు ఎస్సీ ప్రజలు, కులసంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో అర్జీలు అందజేశారు. శనివారం ఉదయం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఎస్సీ కులాల ఉపవర్గీకరణపై కలెక్టర్ ఆనంద్‌తో కలిసి అధికారులతో కమిషన్ చైర్మన్ సమావేశం నిర్వహించారు. ఎస్సీల స్థితిగతులు రిజర్వేషన్ ఫలాలు ఎంత మేరకు అందాయనేది తెలపాలని కోరారు. అనంతరం ఎస్సీ ప్రజలు, సంఘాల నుంచి విజ్ఞప్తులను స్వీకరించారు. పలువురు కుల సంఘాల నేతలు తమ అభిప్రాయాలను కమిషన్ చైర్మన్ ఎదుట వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకమని, వెనుకబాటు తనానికి అది పరిష్కారం చూపదని కొందరు అభిప్రాయ వ్యక్తం చేశారు. ఎస్సీలు ఐక్యంగా ఉండాలని, కులగణన పక్కగా చేపట్టాలని పలువురు కోరారు. ప్రైవేట్ సంస్థల్లో కూడా ఉద్యోగాల్లో రిజర్వేషన్ కల్పించాలని, క్రిమిలేయర్ సమ్మతం కాదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జేసీ కార్తీక్, ఏఎస్పీ సౌజన్య, డీఆర్‌ఓ ఉదయ్‌భాస్కర్, కమిషన్ జిల్లా పర్యటన లైజింగ్ అధికారి, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, సోషల్ వెల్ఫేర్ డీడీ శోభారాణి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి పాల్గొన్నారు.

సంక్రాంతికి 183 స్పెషల్ బస్సులు

నెల్లూరు సిటీ: ఇతర రాష్ట్రాలలో ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తూ సొంత జిల్లాలకు వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం నెల్లూరు జిల్లాకు ఏపీఎస్ ఆర్టీసీ 183 స్పెషల్ బస్సులను ఏర్పాటు చేసినట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం మురళీబాబు శనివారం ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ నుంచి నెల్లూరుకు 121 బస్సులు, బెంగళూరు నుంచి 42, చెన్నై నుంచి 20 స్పెషల్ బస్సులు నడుపుతున్నామన్నారు. ఆయా బస్సుల్లో ప్రయాణించే వారికి సాధారణ చార్జీలు మాత్రమే వసూలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ముందస్తు రిజర్వేషన్ సదుపాయం కూడా స్పెషల్ బస్సుల్లో కల్పించినట్లు తెలిపారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు.

సింహపురి.. క్యారమ్స్ బరి



చరిత్రాత్మక నగరం సింహపురి. జాతీయ స్థాయి క్యారమ్స్ పోటీలకు సిద్ధమైంది. ప్రతిష్టాత్మకమైన నెల్లూరు క్లబ్ ఇందుకు వేదిక అయింది. దేశ స్థాయిలో ప్రతిష్టాత్మకమైన సంస్థల జట్లతోపాటు, మహామహులైన క్రీడా జట్లు, అంతర్జాతీయ క్యారమ్స్ ఫెడరేషన్ ప్రతినిధులు హాజరు కానున్నారు. తొలిసారిగా నెల్లూరులో జరిగే ఈ పోటీలను నెల్లూరు క్లబ్ ఆర్గనైజర్లు ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఏర్పాట్లు చేశారు.

నేటి నుంచి ఆలిండియా ఫెడరేషన్ కప్ టోర్నమెంట్

- నెల్లూరు క్లబ్ వేదికగా నాలుగు రోజులపాటు నిర్వహణ
- అంతర్జాతీయ స్థాయి క్రీడాకారుల రాక




ఏర్పాట్లను పరిశీలిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ఆంధ్ర రాష్ట్ర క్యారమ్ అసోసియేషన్, నెల్లూరు జిల్లా క్యారమ్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 29వ ఆలిండియా ఫెడరేషన్ కప్ టోర్నమెంట్–2025 పోటీలు ఆదివారం నుంచి జరగనున్నాయి. నెల్లూరులో ఈ నెల 5 నుంచి 8వ తేదీ వరకు నెల్లూరు క్లబ్ ఈ జాతీయ స్థాయి క్రీడా పండుగలకు వేదిక కానుంది. జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారుల రాకతో నెల్లూరు క్లబ్ కళకళలాడుతోంది. దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు, అంతర్జాతీయ క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. వీరితో పాటు క్రీడలను ప్రోత్సహించే 10 సంస్థల జట్లు హాజరవుతున్నాయి. ఒక్కొక్క రాష్ట్ర జట్టులో నలుగురు పురుషులు, నలుగురు మహిళలు పాల్గొంటున్నారు. సంబంధిత మేనేజర్లు, కోచ్‌లు, టెక్నికల్ సిబ్బందితోపాటు 400 మంది ఈ టోర్నీ కోసం నెల్లూరుకు వస్తున్నారు. టోర్నీ ప్రతిష్టను పెంచే విధంగా తెలంగాణకు చెందిన టాప్ సీడెడ్‌లు కె.శ్రీనివాస్, రష్మీకుమారి, ప్రస్తుత ప్రపంచ చాంపియన్ శ్రీనివాస్, తమిళనాడుకు చెందిన ఖాజీమాతోపాటు దేశానికి చెందిన ప్రసిద్ధ సంస్థలు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, బీఎస్ఎన్ఎల్, కాగ్, సెంట్రల్ సివిల్ సర్వీసెస్ కల్చరల్ అండ్ స్పోర్ట్స్ బోర్డు, ఎల్‌ఐసీ, ఆర్బీఐ తదితర సంస్థల జట్లతోపాటు ప్రభుత్వ సంస్థల టాప్ సీడెడ్ క్రీడాకారులు పోటీల్లో తలపడనున్నారు. జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులతో పోటీ పడడంతో వర్ధమాన క్రీడాకారుల క్రీడా నైపుణ్యం మెరుగు పరచుకునేందుకు నెల్లూరు వేదిక కానుంది. ఈ పోటీలను ఇఅఖఖ్ఞి ఖ్ఠా ద్వారా ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించే అవకాశం కల్పిస్తున్నారు.

ఏర్పాట్లు సర్వం సిద్ధం

ఆదివారం ఉదయం 10 గంటలకు నెల్లూరు క్లబ్‌లో ఆలిండియా ఫెడరేషన్ క్యారమ్ టోర్నమెంట్ 2024–2025 పోటీలను ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు సర్వం సిద్ధం చేశారు. అంతర్జాతీయ క్యారమ్ ఫెడరేషన్ అధ్యక్షుడు (స్విట్జర్లాండ్) జోసెఫ్ మేయర్‌తోపాటు స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారు. ఇంటర్నేషనల్ క్యారమ్ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ వీడీ నారాయణ్, ఆలిండియా క్యారమ్ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ భారతీనారాయణ్, ఆంధ్రప్రదేశ్ క్యారమ్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎస్కే అబ్దుల్ జలీల్, టోర్నీ కో చైర్మన్ మలిరెడ్డి కోటారెడ్డి, అసోసియేషన్ జిల్లా సెక్రటరీ వీఆర్ శ్రీధర్ పర్యవేక్షకులుగా వ్యవహరిస్తున్నారు.

నెల్లూరు ఆతిథ్యం తెలియజేస్తాం



జాతీయ స్థాయి పోటీలను నిర్వహించడమే గర్వకారణం. నెల్లూరీయుల ఆతిథ్యాన్ని జాతీయ స్థాయిలో తెలియజేస్తాం. క్రీడా వసతి, నిర్వహణలో ప్రతి అంశాన్ని ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నెల్లూరు పేరును జాతీయ స్థాయిలో చిరస్థాయి చేస్తాం. ఇప్పటికే నెల్లూరు క్లబ్‌లో అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశాం.

– సీహెచ్ శ్రీమన్నారాయణ, అధ్యక్షుడు, జిల్లా క్యారమ్ అసోసియేషన్

అంతర్జాతీయ స్థాయిలో ఏర్పాట్లు



సీనియర్ వైస్‌ప్రెసిడెంట్, ఆలిండియా క్యారమ్ ఫెడరేషన్, ప్రెసిడెంట్, ఏపీ క్యారమ్ అసోసియేషన్ మొదటిసారి నెల్లూరులో జాతీయ స్థాయి టోర్నీ జరుపుతున్నప్పటికీ అంతర్జాతీయ స్థాయిలో ఏర్పాట్లు చేశారు. గేమ్, అకామడేషన్, ఫుడ్ ఒకే చోట ఏర్పాటు చేయడం అద్భుతం. నేను మొదటిసారిగా ఈ సదుపాయాన్ని ఇక్కడే చూస్తున్నాను. త్వరలో రూ.12 లక్షల ప్రైజ్‌మనీతో డీసీఎల్ (డెక్కన్ క్యారమ్ లీగ్) నిర్వహించి క్రీడాకారులను ప్రోత్సహిస్తాం.

– డాక్టర్ నీరజ్‌కుమార్ సంపతి

సింహపురికే ప్రతిష్టాత్మకం



ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి పోటీలు నెల్లూరు క్లబ్‌లో నిర్వహించనుండడం చారిత్రాత్మకం. క్రీడలకు సంబంధించిన ప్రతి అంశాన్ని నెల్లూరు క్లబ్ సభ్యులు, సంబంధిత టోర్నీ నిర్వాహకులు జాగ్రత్తగా నిర్వహిస్తారు. ఈ టోర్నీ కోసం రెండు ఫ్లోర్‌ల నిర్మాణాలను అనుకున్న సమయానికి పూర్తి చేయగలిగాం. క్రీడలను ప్రోత్సహించడంలో నెల్లూరు క్లబ్ పూర్తి సహాయ సహకారాలను అందిస్తుంది.

– పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, కార్యదర్శి, నెల్లూరు క్లబ్, టోర్నీ నిర్వాహక కార్యదర్శి

ప్రాణాలు తీసిన పొగమంచు

భానుడు ఉదయించక ముందే బతుకుదెరువు కోసం బయలుదేరిన ఆ దంపతుల పాలిట ఆర్టీసీ బస్సు యమ శకటమైంది. పొగమంచు కమ్ముకున్న సమయంలో ఆర్టీసీ డ్రైవర్ మితిమీరిన వేగం, నిర్లక్ష్యం కారణంగా ముగ్గురు బిడ్డలు అనాథలయ్యారు. ఇంటి నుంచి బయలుదేరిన కొద్ది సేపటికే ఈ విషాద ఘటన జరగడంతో అనసూయనగర్ దిగ్భ్రాంతికి గురైంది.

- ఆటోను ఢీకొన్న పల్లెవెలుగు బస్సు
- ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యంతో దంపతుల మృత్యువాత
- తల్లిదండ్రుల మరణంతో అనాథలైన ముగ్గురు చిన్నారులు
- విషాదంలో మునిగిపోయిన అనసూయనగర్



వెంకటశేషయ్య, వరలక్ష్మి (ఫైల్)



మృతి చెందిన వరలక్ష్మి



బస్సు ఢీకొనడంతో ఆటోలోనే మృతి చెందిన వెంకటశేషయ్య

సంగం: వ్యవసాయ పనులు చేస్తూ, కూరగాయలు అమ్ముకుంటూ ఆ భార్యాభర్తలు కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఊరూరు తిరిగి కూరగాయలు అమ్ముకునేందుకు ఆటోలో బయలుదేరారు. కొద్ది సేపటికే వీరి ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో భర్త అక్కడికక్కడే దుర్మరణం చెందగా, భార్య కొనఊపిరితో నెల్లూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృత్యువు ఒడికి చేరింది. బడికి వెళ్లమని ముగ్గురు బిడ్డలకు జాగ్రత్తలు చెప్పి బయలుదేరిన తల్లిదండ్రులు.. అంతలోనే విగతజీవులై రావడంతో బిడ్డలు గుండెలవిసేలా రోదించారు. అందరితో కలివిడిగా ఉండే ఆ దంపతులు రోడ్డు ప్రమాదంలో మృత్యువాతపడడంతో అనసూయనగర్ విషాదంలో మునిగిపోయింది.

ఆటోను ఢీకొట్టిన ఆర్టీసీ హైర్ బస్సు

సంగం మండలం సిద్ధీపురం పంచాయతీ మజారా అనుసూయనగర్‌కు చెందిన నెల్లూరు వెంకటశేషయ్య (42), నెల్లూరు వరలక్ష్మి (36) దంపతులు. వీరికి ముగ్గురు బిడ్డలు. వెంకటశేషయ్య వ్యవసాయ పనులు చేస్తుంటే, వరలక్ష్మి గంపలో కూరగాయలు తీసుకుని సమీప గ్రామాల్లో విక్రయిస్తుండేది. కూరగాయల వ్యాపారం లాభసాటిగా ఉండడంతో దంపతులు తమ వ్యాపారాన్ని పెంచుకునేందుకు ఇటీవల ఆటో తీసుకుని అందులో కూరగాయలు తీసుకుని మండలంలోని గ్రామాల్లో తిరుగుతూ అమ్మకాలు చేస్తున్నారు. ఈ క్రమంలో వెంకటశేషయ్య, వరలక్ష్మి శనివారం ఉదయం 6 గంటల ప్రాంతంలో ఆటోలో కూరగాయలు తీసుకుని మొదట వెంగారెడ్డిపాళెంలో అమ్ముకుని అక్కడి నుంచి నెల్లూరు – ముంబయి జాతీయ రహదారి పైకి వచ్చి సంగం వైపు బయలుదేరారు. అదే సమయంలో ఆత్మకూరు డిపోకు చెందిన పల్లెవెలుగు హైర్ బస్సు ఉదయాన్నే ఆత్మకూరు నుంచి నెల్లూరు బయలుదేరింది. ఉదయం 6 గంటల సమయంలో పొగమంచు కురుస్తుండడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించని పరిస్థితి. ఆర్టీసీ డ్రైవర్ అతివేగం, నిర్లక్ష్యంగా తన ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్ టేక్ చేస్తూ ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టారు. దీంతో ఆటో ముందు భాగం నుజ్జునుజ్జు కావడంతో వెంకటశేషయ్య అక్కడికక్కడే మృతి చెందాడు.

మరణంలోనూ ఒక్కటయ్యారు

వెంకటశేషయ్య, వరలక్ష్మి వివాహంతో ఒక్కటి కాగా.. అర్ధాంతర మరణంలోనూ ఒక్కటయ్యారని అనసూయనగర్ వాసులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దంపతులిద్దరు అన్యోన్యంగా ఉండడమే కాకుండా.. గ్రామంలో అందరితో కలివిడిగా ఉండేవారు. అలాంటి వారు ప్రమాదంలో మృతి చెందడంపై గ్రామం మొత్తం కన్నీటి పర్యంతమైంది. తల్లిదండ్రుల మరణంతో అనాథలైన ఆ పిల్లల పరిస్థితి ఏమిటని గ్రామస్తులు తల్లడిల్లిపోతున్నారు. తల్లిదండ్రులకు ఏం జరిగిందో తెలియక.. అమ్మ, నాన్నకు ఏమైందంటూ ఆ బిడ్డలు అడుగుతుంటే.. ఏం చెప్పాలో తెలియక గ్రామస్తులు, బంధువులు, కన్నీరు పెట్టుకుంటున్నారు. పొగమంచు ఎక్కువగా ఉన్నప్పుడు వేగంగా ప్రయాణించడం, వాహనాలను ఓవర్ టేక్ చేయొద్దని రవాణాశాఖ హెచ్చరిస్తున్నప్పటికీ ఆర్టీసీ డ్రైవర్ అతివేగంతో పాటు ముందు ఉన్న వాహనాన్ని ఓవర్ టేక్ చేయడం వల్ల ప్రమాదం జరిగిందని అక్కడి వారు చెబుతున్నారు.

ఆటోలో వెనుక ఉన్న వరలక్ష్మి తీవ్రంగా గాయపడడంతో 108 వాహనంలో నెల్లూరు వైద్యశాలకు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వరలక్ష్మి సైతం మృతి చెందింది. ప్రమాద విషయం తెలుసుకున్న సంగం ఎస్సై రాజేష్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలకు పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అనాథలైన ముగ్గురు పిల్లలు

ఈ ప్రమాదంలో మృతి చెందిన దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు శివ దువ్వూరు పాఠశాలలో 8వ తరగతి చదువుతుండగా, చిన్నకుమారుడు, కుమార్తె బాలాజీ, ప్రవల్లిక 4, 2 తరగతులు చదువుతున్నారు. తల్లిదండ్రుల మృతితో చిన్నారులు అనాథలయ్యారు.



ఆర్టీసీ బస్సు వద్ద పరిశీలిస్తున్న ఎంవీఐ, డిపో మేనేజర్లు

ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎంవీఐ

ఆర్టీసీ హైర్ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగి దంపతులు మృతి చెందిన విషయం తెలుసుకుని సంగంలో ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సును ఆత్మకూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాములు పరిశీలించారు. బస్సు కండీషన్ తనిఖీ చేశారు. ఆత్మకూరు డిపో మేనేజర్ కరిమున్నీసాతో ప్రమాద విషయాలపై చర్చించారు.

పెన్షన్ల వెరిఫికేషన్‌కు పెద్దాస్పత్రి డాక్టర్లు

- జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్ విభాగాలు ఖాళీ

నెల్లూరు(అర్బన్): దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులతో మంచానికి, వీల్‌చైర్‌కు పరిమితమై (బెడ్‌రిడన్) ప్రభుత్వ పింఛన్లు పొందుతున్న వారిలో అనర్హులను తేల్చేందుకు కూటమి ప్రభుత్వం వెరిఫికేషన్ ప్రారంభించింది. అనర్హుల పేరుతో అర్హులను కూడా తొలగించేందుకు రంగం సిద్ధం చేసింది. బెడ్‌రిడన్ పేరుతో సర్టిఫికెట్‌లు పొంది పింఛన్ పొందుతున్న వారిని ఇంటింటికి వెళ్లి పరిశీలించేందుకు నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాలకు 24 టీములను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా నెల్లూరు ప్రభుత్వ పెద్దాస్పత్రి, సామాజిక ఆరోగ్యకేంద్రాల నుంచి 7 టీములను తిరుపతి, చిత్తూరు జిల్లాలకు పంపాలని ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలు శనివారం పెద్దాస్పత్రికి చేరాయి. పెద్దాస్పత్రిలోని జనరల్ మెడిసిన్ విభాగం నుంచి 11 మంది డాక్టర్లను, ఆర్థోపెడిక్ విభాగం నుంచి 7 మంది డాక్టర్లను, సామాజిక ఆరోగ్య కేంద్రాల నుంచి 6 మంది డాక్టర్లను తిరుపతి, చిత్తూరు జిల్లాలకు పంపుతున్నారు. నెల రోజులపాటు డాక్టర్లు ఈ వెరిఫికేషన్ సర్వేలో పాల్గొననున్నారు. దీంతో పెద్దాస్పత్రిలో జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్ విభాగాలు దాదాపు ఖాళీ కానున్నాయి. ఫలితంగా రోగులకు వైద్య సేవలందక తీవ్ర ఇబ్బందులు పడనున్నారు. ఒకే దఫా ఇంత మంది డాక్టర్లను పక్క జిల్లాలకు పంపితే ఇక్కడ వైద్య సేవలు ఎలా అందించాలని డాక్టర్లు ఆవేదన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు దీర్ఘకాలిక వ్యాధులతో ఇంటికే పరిమితమైన వారికి రూ.15 వేలు పింఛన్ అందిస్తామని తెలిపారు. ఈ క్రమంలో జిల్లాలో ఇలా బెడ్‌రిడన్‌తో ఉన్న 1274 మంది రూ.15 వేలు లెక్కన పింఛన్ పొందుతున్నారు. వీరిలో ఏదో ఒక వంక పెట్టి పలువురికి పింఛన్ కోత విధించేందుకు కూటమి ప్రభుత్వం పూనుకోవడంతో బాధితులు ప్రభుత్వ తీరును తప్పు పడుతున్నారు. డాక్టర్లను ఇతర జిల్లాలకు రీవెరిఫికేషన్ కోసం పంపితే ఇక్కడ రోగులకు ఎలా వైద్య సేవలందుతాయని పెద్దాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్‌ను ప్రశ్నించగా ఆయన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామంటూ తలపట్టుకున్నారు.

తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారు

- వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత లెక్కలు సరిచేస్తాం
- నన్ను అరెస్టు చేసి జైల్లో పెట్టినా అక్కడి నుంచే పోటీ చేస్తా
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు): వెంకటాచలం జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటశేషయ్య యాదవ్‌పై శ్రావణి అనే మహిళ నుంచి తప్పుడు ఫిర్యాదు చేయించి పోలీసులు కేసు నమోదు చేసి.. అందుకు అవసరమైన తప్పుడు సాక్ష్యాలు సృష్టించారని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి అన్నారు. శనివారం నెల్లూరులో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్‌సీపీ నేతలపై తప్పుడు కేసులు పెడుతోందని విమర్శించారు. వెంకటశేషయ్య అరెస్టుకు సంబంధించి పూర్తి ఆధారాలతో న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని తెలిపారు. పోలీసులే నేరగాళ్లుగా మారి తప్పుడు కేసు బనాయించారనేందుకు సాక్ష్యాధారాలతో సహా ప్రజలకు తెలియజేసేందుకు మీడియా సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వెంకటాచలం సీఐ సుబ్బారావు, రెవెన్యూ ఆర్‌ఐ వ్యవహరిస్తున్న తీరు సరికాదన్నారు. జిల్లా ఎస్పీ కూడా తనకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. వెంకటశేషయ్యను నెల్లూరు రూరల్ స్టేషన్‌లో ఉంచి, వెంకటాచలం సీఐ సుబ్బారావు 2024 డిసెంబరు 24వ తేదీ ఉదయం వెంకటాచలంలోని శ్రావణి అత్తమామల ఇంటికి తీసుకొని వెళ్లి శ్రావణి మామ పెంచలయ్య రెండు రూ.50 విలువ కలిగిన శ్రావణి సంతకంతో కూడిన రెండు ఖాళీ స్టాంప్ పేపర్లు తనకు అందించాడని తప్పుడు స్వాధీన మహజరునామా తయారు చేసి, ఆర్‌ఐ రవికుమార్ అక్కడికి రాకుండానే వచ్చినట్లుగా సంతకం చేసి, మోసపూరితంగా తయారు చేసిన మహజరునామాను కోర్టుకు సమర్పించారని వివరించారు. సీఐ, ఆర్‌ఐలు ఇద్దరు కలసి వెంకటశేషయ్యపై కుట్రపన్ని తప్పుడు కేసు నమోదు చేశారనడానికి ఆధారాలు ఇవేనంటూ మీడియా ఎదుట చూపించారు. ఆ డాక్యుమెంట్ నంబర్లు ఏఎల్ 860784, ఏఎల్ 860785 వీటిని ఎవరికి, ఎప్పుడు ఇచ్చారని కోవూరు సబ్‌రిజిస్ట్రార్‌ను ఆర్టీఏ యాక్ట్ కింద అడగగా.. సదరు డాక్యుమెంట్లు 2022 నవంబరు 15 నాటివి కాదని వాటిని స్టాంప్ వెండర్ లోక్‌నాథ్‌సింగ్ 2024 జూలై 31న కోవూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో కొనుగోలు చేసి, 2024 డిసెంబరు 23న శ్రావణి భర్త పెంచలయ్యకు విక్రయించినట్లుగా లిఖిత పూర్వకంగా ధ్రువీకరించారన్నారు. శేషయ్యపై సోమిరెడ్డి చెప్పినట్లుగా దొంగ కేసు బనాయించడానికి వెంకటాచలం సీఐ సుబ్బారావు 2024 డిసెంబరు 23న స్టాంప్ పేపర్లు కొనుగోలు చేసి, ఆ స్టాంప్ పేపర్లపై 2022 నవంబరు 11వ తేదీ వేసి అక్రమంగా, అన్యాయంగా, యాదవ సామాజిక వర్గానికి చెందిన శేషయ్యపై కేసు నమోదు చేసి జైలుకు పంపించారన్నారు. కేసుకు సంబంధించిన ఎంక్వైరీ చేసే సమయంలో శ్రావణి అత్తమామ ఉన్నట్లుగా నివేదికల్లో పొందుపరిచారు. వాస్తవంగా ఆ సమయంలో వారిద్దరూ లేరన్నారు. తప్పుడు స్టాంప్ పేపర్లు సృష్టించి, కోర్టును తప్పుదోవ పట్టించిన వారందరూ శాశ్వతంగా ఉద్యోగాలు కోల్పోవడంతో పాటు, జైలుకు వెళ్లడం ఖాయమని కాకాణి చెప్పారు. తనపై ఎన్ని తప్పుడు కేసులు పెట్టినా భయపడనని 2029 వరకు తనను అరెస్టు చేసి జైల్లో పెట్టినా అక్కడి నుంచి ఎన్నికలలో పోటీ చేస్తానన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

విద్యార్థులను మోసగించిన కూటమి ప్రభుత్వం

- ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో అర్ధనగ్న ప్రదర్శన

నెల్లూరు (టౌన్): అధికారంలోకి వచ్చిన వెంటనే తల్లికి వందనం పేరుతో ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఇస్తామని వాగ్దానం చేసి, అమలు చేయకుండా సీఎం చంద్రబాబు మోసం చేశారని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మస్తాన్ షరీఫ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక వీఆర్సీ సెంటరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ముందు ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ నాన్నకు ఇచ్చే ఇంధనం మీద ఉన్న శ్రద్ధ.. తల్లికి ఇచ్చే వందనం మీద లేదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో విద్యారంగాన్ని మంత్రి లోకేశ్ గాలికి వదిలివేశారని మండిపడ్డారు. కేబినెట్ మీటింగ్‌లో విద్యారంగానికి పెద్దపీట వేస్తారని తల్లిదండ్రులు, విద్యార్థులు ఎదురు చూశారని, చివరికి నిరాశే మిగిలిందన్నారు. అధికారంలోకి రావడానికి ఇష్టం వచ్చినట్లు హామీలు ఇచ్చి గద్దెనెక్కిన తరువాత హామీలు అమలు చేయలేమంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ విద్యా సంవత్సరం నుంచే తల్లికి వందనం అమలు చేయాలని లేకుంటే రాష్ట్ర వ్యాప్త ఆందోళన చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పవన్‌కిశోర్, నాయకులు శివమ్‌వర్మ, హనీష్, అబ్దుల్, జీవన్, సుధీర్, సోహెల్, శరన్, మౌళి, సాయి తదితరులు పాల్గొన్నారు.



అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

క్లుప్తంగా

ఆదమరిచి నిద్రిస్తూ.. అనంతలోకాలకు

• వృద్ధుడ్ని బలిగొన్న కారు



నెల్లూరు(క్రైమ్): పగలంతా భిక్షాటన చేసుకొని రోడ్డు పక్కన ఆదమరిచి నిద్రిస్తున్న వృద్ధుడ్ని మృత్యువు కారు రూపంలో కబళించిన హృదయ విదారక ఘటన నగరంలో శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. గుర్తుతెలియని 60 ఏళ్ల వృద్ధుడు ఆర్టీసీ పరిసర ప్రాంతాల్లో కొంతకాలంగా భిక్షాటన చేసుకుంటూ సుందర్ లాడ్జి సమీపంలోని దుకాణాల వద్ద రాత్రి వేళ నిద్రించేవారు. ఇదే తరహాలో శుక్రవారం అర్ధరాత్రి నిద్రపోతుండగా, మద్రాస్ బస్టాండ్ వైపు నుంచి మితిమీరిన వేగంతో వెళ్తున్న కారు వృద్ధుడ్ని తొక్కుకుంటూ వెళ్లిపోయింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న సౌత్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. సాంకేతికత ఆధారంగా ప్రమాదానికి కారణమైన కారును గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మితిమీరిన వేగమే ప్రమాదానికి కారణమని తెలిసింది. ఇన్‌స్పెక్టర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు సౌత్ ట్రాఫిక్ పోలీసులను సంప్రదించాలని కోరారు.

సూత్రధారి, పాత్రధారీ చంద్రబాబే

• మాలల జేఏసీ కన్వీనర్ స్వర్ణ వెంకయ్య



రాజీవ్ రంజన్ మిశ్రాకు వినతిపత్రమిస్తున్న స్వర్ణ వెంకయ్య తదితరులు

నెల్లూరురూరల్: ఎస్సీ ఉప వర్గీకరణకు సంబంధించిన సూత్రధారి, పాత్రధారీ చంద్రబాబు అని మాలమహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాలల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ స్వర్ణ వెంకయ్య ఆరోపించారు. వర్గీకరణకు సంబంధించి ప్రభుత్వం నియమించిన ఏక సభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా ఆధ్వర్యంలో సమీక్షను కలెక్టరేట్లోని తిక్కన సమావేశ మందిరంలో శనివారం నిర్వహించారు. కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రాన్ని అందజేసిన అనంతరం స్వర్ణ వెంకయ్య మాట్లాడారు. ఆర్టికల్ 371 ప్రకారం ఎస్సీ వర్గీకరణ విరుద్ధమని గతంలో సుప్రీంకోర్టు 9 / 4 బెంచ్ జడ్జిమెంట్ ఇచ్చిందని గుర్తు చేశారు. ఎస్సీ వర్గీకరణ చేసే హక్కు రాష్ట్ర ప్రభుత్వాలకు లేదని స్పష్టంగా తీర్పునిచ్చిందని తెలిపారు. అన్నదమ్ములుగా ఉన్న మాల, మాదిగలను విడగొట్టడం న్యాయం కాదన్నారు. జిల్లా అధ్యక్షుడు బల్లి వెంకయ్య, వాదనాల వెంకటరమణ, ఎస్సీ అట్రాసిటీ కమిటీ మాజీ సభ్యుడు కొప్పోలు రఘు, దళిత నేతలు పల్లం వెంకయ్య, దళిత బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు లాలం పెంచలయ్య, ఉద్యోగ సంఘ నేతలు కృష్ణ, రాజశేఖర్, మహిళా సంఘ రాష్ట్ర నేతలు చేను సుజాతమ్మ, బాబు, బోయిన రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురు రైతులపై పోలీసులకు ఫిర్యాదు

కలువాయి: మండలంలోని మాదన్నగారిపల్లికి చెందిన ఆరుగురు రైతులపై పోలీసులకు తహసీల్దార్ శ్యామ్‌సుందర్‌రాజు శనివారం ఫిర్యాదు చేశారు. గ్రామంలోని సర్వే నంబర్లు 223, 224లోని ఐదెకరాల ప్రభుత్వ భూమిని పల్లెవనం బ్లాక్ ప్లాంటేషన్, స్టేడియం నిర్మాణానికి కేటాయించారు. ఇందులో పనులు చేపట్టేందుకు ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు యత్నించారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన నరసింహులు, అంజయ్య, చిన్నయ్య, రామయ్య, పెంచలనరసయ్య, కొమ్మి అంజయ్య వారిని అడ్డుకుంటున్నారని లేఖను ఎంపీడీఓ అందజేశారని తహసీల్దార్ తెలిపారు. ఈ క్రమంలో వీరిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కృష్ణపట్నం పోర్టుకు అవార్డులు



ముత్తుకూరు: అదానీ కృష్ణపట్నం పోర్టుకు ఎక్సలెంట్, ఎక్సలెన్సీ అవార్డులు లభించాయి. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో శనివారం నిర్వహించిన 38వ నేషనల్ కన్వెన్షన్ ఆన్ క్వాలిటీ కాన్సెప్ట్‌లో ఈ అవార్డులను అందుకున్నారని పోర్టు వర్గాలు వెల్లడించాయి. క్వాలిటీ సర్కిల్ ఫోరమ్ ఆఫ్ ఇండియా, అటల్ బిహారీ వాజ్‌పేయ్ – ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్‌తో కలిసి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉద్యోగులను పోర్టు సీఈఓ జగదీష్ పటేల్ అభినందించారు.

యువకుడ్ని బలిగొన్న గొడవ

• సంబంధం లేకపోయినా హతమార్చిన వైనం
• నార్తుమోపూరులో ఘటన



కార్తీక్ (ఫైల్)



రోదిస్తున్న కుటుంబసభ్యులు

అల్లూరు: ఆకతాయిల మధ్య జరిగిన గొడవలో ఓ అమాయకుడు బలైన ఘటన మండలంలోని నార్తుమోపూరు అరుంధతీయవాడలో శనివారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై కిశోర్‌బాబు, స్థానికుల వివరాల మేరకు.. స్థానిక అరుంధతీయవాడకు చెందిన చేజర్ల కార్తీక్ (24) తిరుపతిలోని ఓ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. రోడ్డు ప్రమాదంలో చేతికి గాయమవడంతో విశ్రాంతి నిమిత్తం గ్రామానికి కొద్ది రోజుల క్రితం వచ్చారు. అప్పటికే స్థానిక దళిత యువకుల మధ్య వివాదం జరుగుతోంది. శుక్రవారం మధ్యాహ్నం ఇరువర్గాల మధ్య జరిగిన వాగ్వాదం ఘర్షణకు దారితీసింది. స్థానికులు, గ్రామస్తులు జోక్యం చేసుకొని వివాదాన్ని సద్దుమణిగేలా చేశారు. కొద్దిసేపటి తర్వాత ఎనిమిది మంది యువకులు ద్విచక్రవాహనాలపై నార్తుమోపూరు ప్రధాన కూడలికి చేరుకున్నారు. ప్రత్యర్థి వర్గానికి చెందిన ఇద్దరితో పాటు అక్కడే ఉన్న చేజర్ల కార్తీక్‌పై కొమ్మి సుధీర్, తుమ్మతాటి ఆదిత్య, కొమ్మి సురేష్, అరగలపాల్, అరగల అబ్రహాన్, అజ్జం హేమంత్, మాచాల మనోజ్, అరగల లక్ష్మయ్య తమతో తెచ్చుకున్న కర్రలు, రాడ్లతో విచక్షణరహితంగా దాడికి పాల్పడ్డారు. ఆ ఇద్దరూ తప్పించుకోగా, పక్కనే ఓ దుకాణంలో ఉన్న రాడ్డు, సుత్తితో కార్తీక్ గుండెలపై కొట్టారు. ముందుకు వంగిన కార్తీక్ తల వెనుక భాగంలో బలంగా కొట్టడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడే కుప్పకూలడంతో నిందితులు అక్కడి నుండి పరారయ్యారు. బాధితుడ్ని స్థానికులు హుటాహుటిన అల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం నిమిత్తం నెల్లూరు తరలించాలని అక్కడి వైద్యులు సూచించారు. నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, నగదు చెల్లించేంత వరకు ఎలాంటి వైద్యం చేయకుండా కాలయాపన చేశారు. నగదు చెల్లించాక చెన్నై తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం నెల్లూరులోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందారని నిర్ధారించారు. కావలి రూరల్ సీఐ పాపారావుకు సమాచారం అందించారు. మృతదేహానికి పోస్ట్‌మార్టం చేయించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మృతదేహంతో రోడ్డుపై బైఠాయింపు

యువకుడి మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని, ఎఫ్ఐఆర్ కాపీలో అసలు హంతకుల పేర్లను నమోదు చేయాలని బాధితుడి కుటుంబసభ్యులు డిమాండ్ చేశారు. పోలీసుల తీరును నిరసిస్తూ మృతదేహంతో కుటుంబసభ్యులు, గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించారు.

వృద్ధుడి దారుణ హత్య

• గడ్డపారతో తలపై కొట్టి ఘాతుకం
• నెల్లూరులో కలకలం



ఘటన స్థలంలో మృతదేహం



వివరాలను సేకరిస్తున్న ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు

నెల్లూరు(క్రైమ్): వృద్ధుడు దారుణ హత్యకు గురైన ఘటన నగరంలో శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. తూకుమానుమిట్ట వద్ద గల పెన్నా సమీపంలో నివాసం ఉంటున్న అహ్మద్ రసూల్ (65) గుప్తా పార్కు దగ్గర్లోని మోడల్ స్కూల్ వద్ద సైకిల్ మెకానిక్ షాపును నిర్వహిస్తున్నారు. మొదటి భార్య మృతి చెందడంతో అబీదాని వివాహం చేసుకున్నారు. వీరికి నలుగురు సంతానం. మనస్పర్థల నేపథ్యంలో అబీదాని తన పిల్లలతో కలిసి చెన్నైలో ఉంటున్నారు. అప్పటి నుంచి ఒంటరిగా ఉంటూ ప్రజానాట్య మండలి కళాకారుడిగా కొనసాగుతున్నారు. ఈ క్రమంలో శుక్రవారం అర్ధరాత్రి దాటాక తన ఇంట్లో దారుణ హత్యకు గురయ్యారు. తల పగిలి, శరీరంపై రక్త గాయాలై ఉన్నాయి. గమనించిన స్థానికులు ములుమూడి బస్టాండ్ వద్ద నివాసం ఉంటున్న మృతుడి మేనల్లుడు ఇబ్రహీంకు తెలియజేశారు. ఘటన స్థలానికి చేరుకొని సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సంతపేట ఇన్‌స్పెక్టర్ మద్ది శ్రీనివాసరావు సిబ్బందితో కలిసి హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం పక్కన రక్తంతో తడిసిన గడ్డపార ఉంది. దుండగులు గడ్డపారతో తలపై కొట్టడంతో పాటు పదునైన ఆయుధంతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి మృతి చెంది ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఇబ్రహీం ఫిర్యాదు మేరకు హత్య కేసును ఇన్‌స్పెక్టర్ నమోదు చేశారు. రసూల్ మృతదేహానికి ఆవాజ్ నేతలు, ప్రజానాట్య మండలికి చెందిన పలువురు నివాళులర్పించారు.

అదుపులో అనుమానితుడు..?

రసూల్ ఇల్లు పెన్నాకు సమీపంలో ఉంది. ఆయన ఇంటి వెనుక, ముందు వైపు ఖాళీ స్థలం ఉండటం.. ఆ ప్రాంతంలో పెద్దగా జనసంచారం లేకపోవడంతో కొందరు నిత్యం గంజాయి, మద్యం సేవిస్తుంటారు. వీరిని రసూల్ పలుమార్లు అడ్డుకున్నారు. ఈ క్రమంలో సమీప ప్రాంతానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మద్యమో.. గంజాయో సేవిస్తుండగా రసూల్ అడ్డుకున్నారని, వారే ఘాతుకానికి ఒడిగట్టి ఉండొచ్చని స్థానికులు పేర్కొంటున్నారు. ఇదే విషయాన్ని పోలీసులకు తెలియజేయడంతో ఆ దిశగా విచారణ చేపట్టారు. సమీపంలోని సీసీ ఫుటేజీలను పరిశీలించి అనుమానితుల్లో ఒకర్ని అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నారని సమాచారం.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఏఎస్సై

సోమశిల: గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో వ్యక్తి గాయపడిన ఘటన అనంతసాగరం మండలంలోని ఎగువపల్లి సమీపంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. గోవిందంపల్లికి చెందిన రైతు అల్లంపాటి మహేంద్రరెడ్డి సేద్యం నిమిత్తం ఎడ్లబండిపై యాకర్లపాడు బయల్దేరారు. ఈ క్రమంలో ఎగువపల్లి సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఎడ్ల బండికి ఉన్న నగ విరిగి మహేంద్ర కాలుపై పడింది. దీంతో కాలు విరిగి, తలకు గాయాలయ్యాయి. స్థానికులు గమనించి ప్రైవేట్ వాహనంలో ఆత్మకూరులోని హాస్పిటల్‌కు తరలించారు. ఘటన స్థలాన్ని సోమశిల ఏఎస్సై లక్ష్మీనారాయణ పరిశీలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

బస్సు దిగుతూ జారిపడి..

• మహిళకు గాయాలు

సంగం: ఆర్టీసీ బస్సు దిగుతూ జారిపడటంతో మహిళ గాయపడిన ఘటన సంగం మండలం దువ్వూరు వద్ద శనివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. దువ్వూరుకు చెందిన పెంచలమ్మ పామూరు నుంచి ఆర్టీసీ బస్సులో వచ్చారు. దువ్వూరు వద్ద బస్సు దిగే క్రమంలో వాహనం ఒక్కసారిగా కదలడంతో కిందపడి తలకు గాయమైంది. స్థానికులు వెంటనే బుచ్చిరెడ్డిపాళెంలోని వైద్యశాలకు తరలించారు. పోలీసులు విచారణ చేపట్టారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్



వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీధర్

కావలి: నూతన సంవత్సర రోజున పట్టణంలో గృహిణిని హతమార్చిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టణంలోని తన కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలను కావలి డీఎస్పీ శ్రీధర్ వెల్లడించారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన శ్రీకాంత్ బిస్వాస్ పట్టణంలో స్థిరపడి ఆర్ఎంపీగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో తన భార్య అర్పితా బిస్వాస్‌ను హత్య చేసి వివస్త్రగా ఇంటి సమీపంలోని పంట కాలువలో పడేశారంటూ కావలి ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్లో ఈ నెల ఒకటిన ఆయన ఫిర్యాదు చేశారు. ఆమె శరీరంపై గాయాలున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో ఒకటో పట్టణ సీఐ ఫిరోజ్, సిబ్బందితో కలిసి దర్యాప్తు చేపట్టారు.

హత్య జరిగిందిలా..

గత నెల 31వ తేదీ రాత్రి నిందితుడు నయన్ బిస్వాస్‌తో కలిసి శ్రీకాంత్ బిస్వాస్ తన ఇంట్లో మద్యం సేవించారు. అనంతరం అక్కడే నిందితుడు నిద్రించారు. తెల్లవారుజామున మూడు గంటల సమయంలో లైంగిక వాంఛ తీర్చుకోవాలనే ఉద్దేశంతో తన గదిలో నిద్రిస్తున్న అర్పితా బిస్వాస్ వద్దకెళ్లాడు. ఆమె ప్రతిఘటించడంతో రాడ్‌తో కొట్టాడు. దీంతో ఆమె మృతి చెందగా, మృతదేహాన్ని ఇంటికి 100 మీటర్ల దూరంలోని పంట కాలువ వద్దకు తీసుకెళ్లాడు. ఆపై పాశవికంగా వ్యవహరించి మృతదేహంపై లైంగిక వాంఛలు తీర్చుకున్నాడు. మృతురాలిది, నిందితుడిది పశ్చిమ బెంగాల్‌లోని ఒకే గ్రామం. నిందితుడ్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

రక్తమోడిన పట్టాలు

• రైలు నుంచి జారిపడి ఇద్దరు.. ఢీకొని ఒకరి మృతి





మృతి చెందిన వ్యక్తులు



వివరాలను సేకరిస్తున్న రైల్వే పోలీసులు

కొడవలూరు: జిల్లా పరిధిలోని రైలు పట్టాలు రక్తమోడాయి. వేర్వేరు ప్రాంతాల్లో శనివారం జరిగిన ప్రమాదాల్లో రైలు నుంచి జారిపడి ఇద్దరు.. ఢీకొనడంతో ఒకరు మృతి చెందారు. రైల్వే పోలీసుల వివరాల మేరకు.. కొడవలూరు రైల్వేస్టేషన్ దక్షిణం వైపు దిగువ లైన్లో పట్టాలను గుర్తుతెలియని వ్యక్తి దాటుతుండగా, రైలు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడి వయస్సు 40 నుంచి 45 ఏళ్ల మధ్య ఉంటుందని, కాఫీ కలర్ టీ షర్ట్, నలుపు, బ్రౌన్ చెక్స్ కలిగిన లుంగీని ధరించి ఉన్నారని, ఎత్తు 5.6 అడుగులు ఉంటుందని రైల్వే అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 98483 43638 నంబర్‌కు సమాచారమివ్వాలని కోరారు.

• కొడవలూరు – తలమంచి స్టేషన్ల మధ్య రైల్లో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తూ జారిపడటంతో సుమారు 55 నుంచి 60 ఏళ్ల వ్యక్తి మృతి చెందారని రైల్వే అధికారి శ్యామ్‌కుమార్ తెలిపారు. మృతుడు బ్లూ కలర్ స్వెటర్, లాల్చి, వైట్ కలర్ ఫుల్ బనియన్, కాఫీ కలర్ ఫుల్ డ్రాయర్, వైట్ కుర్తాను ధరించి ఉన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 94406 27648 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

బిట్రగుంట: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో రైలు నుంచి జారిపడటంతో ప్రయాణికుడు మృతి చెందారు. 144వ నంబర్ ఎల్సీ గేట్ సమీపంలో జరిగిన ఘటనలో సుమారు 40 ఏళ్ల వ్యక్తి మృతి చెందారని రైల్వే పోలీసులు తెలిపారు. పోస్ట్‌మార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు.

నిషేధిత యాంటీ బయోటిక్స్ వాడితే చర్యలు




సమావేశాన్ని నిర్వహిస్తున్న జేసీ కార్తీక్

నెల్లూరు(సెంట్రల్): నిషేధిత యాంటీ బయోటిక్స్‌ను ఆక్వా సాగులో వినియోగిస్తే కఠిన చర్యలు చేపడతామని జేసీ కార్తీక్ పేర్కొన్నారు. యాంటీ బయోటిక్స్ వినియోగాన్ని అరికట్టేందుకు సంబంధించిన జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని నగరంలోని కలెక్టరేట్లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యాంటీ బయోటిక్స్‌ను రొయ్యల సాగులో వినియోగిస్తుండటంతో ఎగుమతులు వెనక్కొస్తున్నాయని చెప్పారు. వినియోగించిన వారిపై చట్టం మేరకు కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. రొయ్యల మేత, రసాయనాలు, మందులను విక్రయించే షాపులు, తయారు చేసే ప్రాంతాల్లో తనిఖీలను తరచూ చేపట్టాలని ఆదేశించారు. నిషేధిత యాంటీ బయోటిక్స్‌ను వినియోగించే వారి లైసెన్స్‌లను రద్దు చేయాలన్నారు. టాస్క్‌ఫోర్స్ కమిటీ ప్రతి నెలా సమావేశాన్ని నిర్వహించి నివేదికలను అందజేయాలని చెప్పారు. జిల్లా స్థాయి కమిటీ కన్వీనర్, మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు, డీఎస్పీ శ్రీనివాసరావు, డ్రగ్స్ కంట్రోల్ అధికారి వీరకుమార్ రెడ్డి, ఫుడ్ కంట్రోల్ ఏడీ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిమ్మ ధరలు

పొదలకూరు (కిలో)



పెద్దవి: రూ.28
సన్నవి: రూ.23
పండ్లు: రూ.12

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్) : 113
లేయర్ (లైవ్) : 85
బ్రాయిలర్ చికెన్ : 206
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 226
లేయర్ చికెన్ : 145

వైద్యులు సమయపాలన పాటించాలి



మాట్లాడుతున్న అధికారులు

నెల్లూరు(అర్బన్): పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల్లో పనిచేస్తున్న డాక్టర్లు సమయపాలనను తప్పక పాటించాలని డీఎంహెచ్ఓ సుజాత ఆదేశించారు. నగరంలోని వైద్యశాఖ కార్యాలయంలో జిల్లాలోని డాక్టర్లతో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. విధులకు సకాలంలో హాజరుకాని వారిపై చర్యలు చేపడతామని చెప్పారు. ఎఫ్ఆర్ఎస్ హాజరు వేయని డాక్టర్ల జీతభత్యాల్లో కోత విధిస్తామని స్పష్టం చేశారు. ఆరోగ్య సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను నూరు శాతం సాధించాలని చెప్పారు. ఎన్సీడీ స్క్రీనింగ్ కింద ప్రతి ఏఎన్ఎం, ఎమ్మెల్‌హెచ్‌పీలు కనీసం ఐదిళ్లను సందర్శించి వారి గృహాల్లో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించేలా డాక్టర్లు చర్యలు చేపట్టాలని సూచించారు. ఏడీఎంహెచ్ఓ ఖాదర్‌వలీ, డీఐఓ ఉమామహేశ్వరి, ఎఫ్పీసీ నోడల్ అధికారి దయాకర్, కావలి డిప్యూటీ డీఎంహెచ్ఓ బ్రిజిత, డీపీఎంఓ రమేష్, కందుకూరు ఇన్‌చార్జి డిప్యూటీ డీఎంహెచ్ఓ రజని, ఆర్బీఎస్కే అధికారి యశ్వంత్, డెమో అధికారి కనకరత్నం తదితరులు పాల్గొన్నారు.

వీఎస్‌యూలో 22న కొత్త కోర్సు ప్రారంభం

వెంకటాచలం: వీఎస్‌యూలో కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ – డొమెస్టిక్ నాన్ వాయిస్ శిక్షణ కోర్సును విక్రమ సింహపురి యూనివర్సిటీ, ఏపీఎస్సెస్డీసీ సంయుక్తంగా ఈ నెల 22న ప్రారంభించనున్నాయని స్కిల్ డెవలప్‌మెంట్ కో ఆర్డినేటర్ డాక్టర్ విజేత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 25 ఏళ్లలోపు ఉండి, పదో తరగతి కనీస అర్హత కలిగిన అభ్యర్థులు శిక్షణకు అర్హులని చెప్పారు. శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్‌తో పాటు ఉపాధి అవకాశాన్ని కల్పిస్తామని పేర్కొన్నారు. వివరాలకు 95734 82179 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.